నమస్తే తెలంగాణ

నల్లగొండ

5 | నల్లగొండ, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | NALGONDA

## ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ నారాయణ రెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 12 : ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో దానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రం మొదలు గ్రామ పంచాయతీల వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల్లో జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. జిల్లా కేంద్ర పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఉదయం పది గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజాపాలన దినోత్సవానికి సంబంధించి ఆహ్వానాలు వెంటనే పంపాలని, వేడుకలకు హాజరయ్యే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్ల నిమిత్తం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి పూర్తి చేస్తామన్నారు.

# అడ్మిషన్ల కోసం ఆపసోపాలు

## ప్రశ్నార్థకంగా కొత్తగా ఏర్పాటైన తిరుమలగిరి జూనియర్ కళాశాల

- ఇప్పటివరకు 32 అడ్మిషన్లే.. 12 మందికి మించని అటెండెన్స్
- ఇతర ప్రాంతాల అధ్యాపకులతో సర్దుబాటు
- రెండు చోట్లా నష్టపోతున్న విద్యార్థులు

సూర్యాపేట, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : తిరుమలగిరిలో ప్రభుత్వం ఇటీవల కొత్తగా జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. ఈ ఏడాది నుంచే తరగతులను ప్రారంభించింది. కానీ విద్యార్థులు లేక అభాసుపాలయ్యే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ నేతలు తాము ఏదో సాధించామన్నట్లుగా హడావుడిగా కళాశాల మంజూరు చేసి చేతులు దులుపుకొన్నారు. కానీ ఇక్కడ విద్యార్థుల సంఖ్య, వసతులను పట్టించుకోలేదు. దాంతో సరిపడా అడ్మిషన్లు లేకపోవడంతో అధ్యాపకులు, సిబ్బందిని కేటాయించలేని దుస్థితి ఏర్పడింది. అన్ని గ్రూపులకు కలిపి 32 అడ్మిషన్లు రాగా వచ్చే విద్యార్థులు కూడా 12 మందికి మించి హాజరుకావడం లేదు. ప్రస్తుతం సమీప కళాశాల అధ్యాపకులను బోధించేందుకు సర్దుబాటు చేయడంతో రెండువైపులా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### అంచనాలు వేయకుండా..

ఎక్కడైనా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలంటే అడ్మిషన్లు ఎన్ని అవుతాయో అలోచన చేసి అంచనాలు వేస్తారు. కానీ తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎలా మంజూరు చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి, నెమ్మికల్, నడిగూడెం, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఒక్క సూర్యాపేట మినహా మిగిలిన కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రమే. కానీ తిరుమలగిరిలో కొత్త కళాశాల ఎందుకనే ప్రశ్న ఉదయిస్తున్నది. తిరుమలగిరిలో ఇప్పటికే మోడల్, కస్తూర్బాతోపాటు ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల కూడా ఉంది. పేద, మధ్య తరగతి విద్యార్థులు పది పాస్ అయిన తర్వాత హాస్టల్స్ సౌకర్యం ఉన్న మోడల్, కస్తూర్బాలోకి వెళ్తున్నారు. ఫీజులు కట్టే స్తోమత ఉన్న వారు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుతున్నారు. ఈ క్రమంలో తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ఎక్కడి నుంచి రావాలనేది సమస్య ఉత్పన్నమవుతున్నది.

### 45 రోజుల్లో 32కు మించని అడ్మిషన్లు

తిరుమలగిరి జూనియర్ కళాశాలలో ఇప్పటివరకు 32కు మించి అడ్మిషన్లు కాలేదు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ నాలుగు కోర్సుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం మంజూరయ్యాయి. సైన్స్ గ్రూపులకు 30, ఆర్ట్స్ గ్రూపులకు 40 మంది చొప్పున అడ్మిషన్లు తీసుకోవాల్సి ఉంది. మొత్తం 240 అడ్మిషన్లకుగానూ కేవలం 32 మాత్రమే అయ్యాయి. అందులో కూడా కళాశాలను ఎలాగైనా నిలబెట్టాలని కొంతమంది ప్రైవేట్ కళాశాలలపై వత్తిడి చేసి అడ్మిషన్లు తీసుకొస్తుండగా, ఎప్పుడో పది పాస్ అయి ఇంటి వద్ద ఉన్నవారిని కూడా తీసుకొచ్చి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది.

### గతంలోనే వద్దని మంజూరు చేయలే

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తిరుమలగిరి మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయాన్ని ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయించారు. అలాగే నాడు విద్యార్థి సంఘాలు తిరుమలగిరిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని నాటి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు విజ్ఞప్తి చేసినా తిరస్కరించారు. 'ఇప్పటికే ఇక్కడ రెండు కళాశాలలు ఏర్పాటు చేశాం.. పక్కనే ఉన్న తుంగతుర్తిలో ఇంటర్ కళాశాల ఉన్నది. ఈ ప్రాంతంలో కళాశాల ఏర్పాటుకు సరిపడా విద్యార్థులు ఉండరు' అని విద్యార్థి సంఘాలకు విడమర్చి చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో సాధించినట్లుగా అవకాశం లేని చోట జూనియర్ కళాశాల ఏర్పాటు చేసింది.



తిరుమలగిరి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల భవనానికి రంగులు వేసి ఉంచిన దృశ్యం

### పోస్టులేవి?

కళాశాల ఏర్పాటు చేయాలంటే ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఆఫీస్ స్టాఫ్ అవసరం ఉంటుంది. కానీ తిరుమలగిరికి కళాశాల మంజూరు చేసి కనీసం ఆఫీస్ స్టాఫ్ కూడా ఏర్పాటు చేయలేదు. నాలుగు గ్రూపులు, రెండు మీడియమ్‌లకు కలిపి ప్రస్తుతం తిరుమలగిరి ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలకు మూడు గదులను కేటాయించారు. ప్రతి నిత్యం 10 నుంచి 12 లోపు మంది విద్యార్థులే హాజరవుతున్నారు. బోధన చేసేందుకు తుంగతుర్తి, నెమ్మికల్, సూర్యాపేట నుంచి అధ్యాపకులను రెండు, మూడు రోజులకు ఒక సారి వచ్చి వెళ్లేలా సర్దుబాటు చేస్తున్నారు. దాంతో రెండు చోట్ల విద్యార్థులు నష్టపోయే పరిస్థితి దాపురించింది. కనీసం గెస్ట్ ఫ్యాకల్టీని కూడా ఏర్పాటు చేయడం లేదు.



ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

# పైరవీ ఉంటేనే సీటు ఇస్తారా?

- ఎన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయో తెలువకుండా స్పాట్ అడ్మిషన్లు చేపట్టారా?
- ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద ఉద్రిక్తత
- తమ పిల్లలకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

సూర్యాపేట రూరల్, సెప్టెంబర్ 12 : గురుకుల పాఠశాలలో తమ పిల్లలకు రావాల్సిన సీట్లు పక్కదారి పడుతున్నాయని, పైరవీ ఉంటేనే సీట్లు ఇస్తున్నారని సూర్యాపేట మండలం ఇమాంపేట సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. దురాజ్‌పల్లి –మిర్యాలగూడెం రహదారిపై ధర్నా నిర్వహించారు. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో ఎన్ని సీట్లు ఉన్నాయో తెలుపకుండా స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారని మండిపడ్డారు.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి 5 నుంచి 9 వ తరగతి వరకు గురుకుల హాస్టళ్లలో సీట్లు 99 ఖాళీగా ఉంటే 3 వేల మందిని ఎందుకు పిలిచారని అన్నారు. ఉదయం 2 సీట్లు, మధ్యాహ్నం 45 సీట్లు, ఆ తరువాత 99 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారని, అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించే అధికారులు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే లెటర్లు ఉన్నాయా? అని అడుతున్నారని చెప్పారు. పైరవీలు ఉంటేనే సీట్లు ఇస్తారా అని ప్రశ్నించారు. ఉదయం 8 గంటల నుంచి జ్వరంతో బాధపడుతున్న పిల్లలతో తిండి తిప్పలు లేక సీటు వస్తుందనే ఆశతో పాఠశాలకు వచ్చామని, సాయంత్రం 6గంటలవుతున్నా క్లారిటీ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ సక్రమంగా నిర్వహించి తమ పిల్లలకు న్యాయం విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

# నేతన్నలకు కాంగ్రెస్ దోఖా..!

## పాత పథకాలు ఒక్కొక్కటిగా బంద్

- కొత్త స్కీమ్‌లపై చడీచప్పుడు లేదు
- ఇప్పటికే రసాయనాలు, నూలుపై సబ్సిడీ నిలిపివేత
- పొదుపు పథకం గడువు ముగిసినా నో రెన్యూవల్
- ఎన్నికల ముందు ఎన్నో హామీల ప్రకటన
- ఇప్పుడు ఒక్కటీ అమలు చేయని తీరు
- బీమా వయసు, పింఛన్ పెంపు, జీరో జీఎస్టీ ఏమాయే..?
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేత కార్మికులు



**చేనేత కార్మికులను రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు అర చేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్.. ఇప్పుడు మొండి చెయ్యి చూపిస్తున్నది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు పూర్తి కావడంతో నేతన్నలను గాలికొదిలేసింది. అంతటితో ఆగకుండా ఉన్న పథకాలను ఊడబీకుతున్నది. బీఆర్ఎస్ హయంలో సమర్థంగా అమలైన స్కీమ్‌లను అటకెక్కిస్తున్నది. పైగా..కొత్త పథకాలను ప్రకటించకుండా, అమలు చేయకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నది.**

*– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ)*

యాదాద్రి జిల్లాలో సుమారు 11 వేల మంది నేత కార్మికులు ఉంటారు. వీరంతా రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. నెలంతా పనిచేసినా పూటగడవడమే గగనం. అలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసింది. వలసలు వెళ్లిన కార్మికులు కూడా తిరిగి వెనక్కి వచ్చారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీన్ మారింది. నేతన్నలను బతుకు దినదిన గండంగా మారుతున్నది. చేనేత పథకాలను అన్నీ కొనసాగిస్తామని ఎన్నికల్లో ప్రకటించినా.. ఇప్పుడు మాత్రం ఉన్న పథకాలకు హస్తం సర్కారు పాతరేస్తున్నది. మరోవైపు టెస్కో చేనేత వస్త్రాల కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. చేనేత పట్టు చీరల నిల్వలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడు కొనాల్సిన టెస్కో కనీసం పట్టించుకోవడంలేదు. వస్త్ర నిల్వలు రూ. కోట్లల్లో పేరుకుపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

### పొదుపు పథకం కొనసాగింపేది..?

నేత కార్మికుల సామాజిక భద్రత కోసం తీసుకొచ్చిన పొదుపు పథకం అమలుపై ప్రతిష్టంభన నెలకొంది. ఆగస్టుతో పథకం గడువు ముగిసింది. అయితే మళ్లీ పథకం కొనసాగించాలా..? వద్దా..? అనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. అధికారులు మాత్రం తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని చెబుతున్నారు. ఇటీవల ఐఐహెచ్‌టీ ప్రారంభోత్సవ సభలోనూ సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నేతన్నల్లో ఆందోళన రేకెత్తిస్తున్నది. ఈ పథకం కింద ఇప్పటి వరకు నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ 1లో జమచేసిన తర్వాత.. ప్రభుత్వం ఆర్డీ 2లో 15శాతాన్ని నేరుగా జమ చేయాలి. ఆ మొత్తం నగదును వడ్డీతో సహా మూడేండ్ల తర్వాత కార్మికులకు అందుతుంది. ప్రస్తుత 2021–2024 సంవత్సరానికి గానూ ఇటీవల పూర్తి కావడంతో కొత్తగా మళ్లీ ప్రారంభించాల్సి ఉంది.



కోదాడ రూరల్ : తొగర్రాయిలో కేంద్ర బృందానికి వరద తీవ్రతను వివరిస్తున్న రైతు నర్సయ్య

# సాయం చేసి ఆదుకోండి సారూ

- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందం
- మునిగిన పంటలు, దెబ్బతిన్న రోడ్లు, కాల్వల పరిశీలన
- నష్టంపై వివరాల సేకరణ..
- నష్ట పరిహారం అందించేందుకు సహకరిస్తామని వెల్లడి

కోదాడ రూరల్/అనంతగిరి/నడిగూడెం/హుజూర్‌నగర్, సెప్టెంబర్ 12 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం జిల్లాకు కేంద్ర బృందం వచ్చింది. కోదాడ, అనంతగిరి, నడిగూడెం, హుజూర్‌నగర్‌తోపాటు పలు మండలాల్లో పర్యటించింది. మునిగిన పంటలు, దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, కూలిన ఇండ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా వరద బాధితులు కేంద్ర బృందానికి తమకు నష్టాన్ని వివరించారు. తాము అన్ని విధాలా కోల్పోయామని, ప్రభుత్వ తరపున ఆదుకోవాలని వేడుకున్నారు.

### గోండ్రియాల నుంచి..

జిల్లాకు వచ్చిన కేంద్ర బృంద సభ్యులు రెండు టీములుగా విడిపోయి వరద ప్రాంతాల్లో పర్యటించారు. మొదట అనంతగిరి మండలం గోండ్రియాల, రంగాపురం గ్రామాల్లో బృంద సభ్యులు కేపీ సింగ్, మహేశ్‌కుమార్, శాంతినాథ్, శివప్ప ముంపు ప్రాంతాలను పరిశీలించారు. గోండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివాలయం, ఎస్సీ కాలనీలను సందర్శించి అక్కడి గృహస్తులతో మాట్లాడి వరద నష్టాన్ని తెలుసుకున్నారు. గ్రామంలో జరిగిన నష్టంపై మండల అధికారుల నుంచి నివేదిక సేకరించారు. అనంతరం కోదాడ మండలం తొగర్రాయి, కూచిపూడి గ్రామాల్లో పర్యటించి నష్టం వివరాలు తెలుసుకున్నారు. తొగర్రాయిలో ప్రహరి కూలిన నామాల సాయిలు ఇంటిని పరిశీలించి, రైతు పోతురాజు నర్సయ్య ద్వారా వరద తీరును అడిగి తెలుసుకున్నారు. వరద తాకిడికి ఇంటి సామగ్రి కోల్పోయిన బాధితులరాలు వంగాల మమతతోపాటు అందరికీ నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. వారికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పంట నష్టం, రోడ్ల పరిస్థితిని వివరించారు. ఆ తర్వాత నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు పడిన గండిని పరిశీలించారు. అధికారులను కారణాలు అడిగి వివరాలను తెలుసుకున్నారు. నీట మునిగిన పొలాలు, ఇసుక మేట వేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువు రైతుల కేంద్ర బృంద సభ్యులకు భారీ వర్షాల తీవ్రంగా నష్టపోయామని, తమను ఆదుకోవాలని కోరారు.

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో రాకేష్ మీనా ఆధ్వర్యంలో మరో కేంద్ర బృంద సభ్యులు పర్యటించారు. నల్ల చెరువును పరిశీలించి నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్‌మీనా మాట్లాడుతూ బురుగడ్డ, గోపాలపురం రెండు గ్రామాల మధ్య ఆర్‌సీపీ బిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. కేంద్ర బృదం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కేంద్ర బృందానికి పలు వరద ప్రాంతాల్లో జరిగిన నష్టంపై ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేసి వివరించారు.వారి వెంట జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ రఘు, తాసీల్దార్లు నాగేంద్రబాబు, హిమబిందు, ఎంపీడీఓ సుష్మ, ఏడీ రాజు, ఏఓ స్వర్ణ, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, దొంగరి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ రూరల్ : బూరుగడ్డలో వరద బాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు




నల్లగొండలోని వల్లభరావు చెరువు వద్ద గణనాథుడి నిమజ్జనం


*గణేశ్ నవరాత్రోత్సవాలను ఊరూవాడ సంబురంగా నిర్వహించుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ముందస్తుగా నిమజ్జనోత్సవాలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంతోపాటు పలు చోట్ల డప్పు చప్పుళ్లు, నృత్యాల నడుమ గణనాథుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు.*

# ఏదీ ఇన్‌స్పైర్?

## పాఠశాలల్లో ఇన్‌స్పైర్ మనక్‌పై కనిపించని ఆసక్తి

- భావి శాస్త్రవేత్తల తయారీపై నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- ఇప్పటివరకు జిల్లాలో నమోదైన ప్రాజెక్టులు 1,022
- గతేడాది 1,458 నామినేషన్లతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- ఈ నెల 15 వరకు గడువు.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి స్పందన కరువు

రామగిరి, సెప్టెంబర్ 12 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి నూతన ఆలోచనలు చేసేలా విద్యాశాఖ నిర్వహిస్తున్న 'ఇన్‌స్పైర్ మనక్'పై పాఠశాలలు అంతగా ఆసక్తి చూపడం లేదు. జూలై 1 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 15తో ముగియనుంది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇన్‌స్పైర్ మనక్‌కు 727 ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అర్హత కలిగి ఉన్నాయి. గురువారం నాటికి 1,022 నామినేషన్లు రాగా వీటిలో ప్రభుత్వం మినహాయించి 59మాత్రమే ప్రైవేట్ పాఠశాలలవి. పలు పర్యాయాలు ఇన్‌స్పైర్ మానక్‌పై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించినప్పటికీ ప్రైవేట్ పాఠశాలలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనేది స్పష్టమవుతుంది. ఉత్తమ ప్రదర్శనలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతోపాటు స్టార్టప్‌గా అవతరించే అవకాశం ఉన్నప్పటికీ విద్యార్థులను ప్రోత్సహించకపోవడంతో పలు విమర్శలు వస్తున్నాయి.



### ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేలు ఇస్తున్న ప్రభుత్వం

ఇన్‌స్పైర్ మనక్ కింద 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల నుంచి ఎంపిక చేసిన లక్ష ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఒక్కోదానికి ఖర్చుల కోసం రూ. 10 వేలు విద్యార్థి ఖాతాలకు విడుదల చేస్తుంది. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల్లో పది శాతం రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వాటిలో పది శాతం జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలిచే 60 నమూనాలను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం దక్కనుంది. ఒక్కో జాతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.20 వేల నగదు పురస్కారం అందజేస్తారు.

### ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు

కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ పేరుతో ఏటా అవార్డులను అందజేస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 చొప్పున నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రాజెక్టులకు నామినేషన్స్‌కు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆమోదంతో వారి గైడ్ టీచర్ సహకారంతో www.inspireawards-dst.gov.in ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఎంపికైన ప్రాజెక్టులకు ఖర్చుల కోసం ఒక్కో దానికి రూ. 10వేలు ప్రభుత్వం అందజేస్తుంది. తయారు చేసిన ప్రాజెక్టులను జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శిస్తారు. అక్కడ ఎంపికైతే రాష్ట్రస్థాయి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైతే జాతీయ స్థాయికి పంపిస్తారు.

### నామమాత్రంగా స్పందన

ఇన్‌స్పైర్ మనక్‌లో నమోదు చేసుకోవడానికి జూలై 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు గడువు ఇచ్చారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా యాజమాన్యాల పరిధిలో 727 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమికోన్నత పాఠశాలలు 275 (128 ప్రభుత్వ, 147 ప్రైవేట్), ఉన్నత పాఠశాలలు 454(229 ప్రభుత్వ, 225 ప్రైవేట్) ఉన్నాయి. గురువారం వరకు 286 పాఠశాలల నుంచి 1,022 ప్రాజెక్టులు నమోదు చేసుకున్నారు. వీటిలో 271 ప్రభుత్వ పాఠశాలల నుంచి 963, 15 ప్రైవేట్ పాఠశాలల నుంచి 59 ఉన్నాయి. సగానికిపైగా పాఠశాలలు ముందుకు రాకపోవడంతో అధికారుల పని తీరుతోపాటు ఆయా పాఠశాలల యాజమాన్యాలు, హెచ్‌ఎంల నిర్లక్ష్య వైఖరి తెలుస్తున్నది. ఎంఈఓలు, జిల్లా విద్యాశాఖాకారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

### అన్ని పాఠశాలలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పాఠశాల స్థాయిలో విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి చక్కటి అవకాశం ఇన్‌స్పైర్ మనక్. ఈ పోటీల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా యాజమాన్యాలు చొరవ చూపాలి. గత సంవత్సరంతో చూస్తే ఈ సారి తక్కువ సంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలలు ఆసక్తి చూపడం లేదు. నామినేషన్లు చేయని పాశాలలతో రివ్యూ చేసి, అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

–బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

### ఇది అద్భుతమైన అవకాశం



ఇన్‌స్పైర్ మనక్‌తో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది ఏర్పడుతుంది. అద్భుతమైన అవకాశాన్ని అందిపుచ్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. గడువు ముగిసేలోగా నిర్ధిష్ట లక్ష్యం చేరుకునేలా అందరం కృషి చేద్దాం. అర్హత ఉండి దరఖాస్తులు సమర్పించని పాఠశాలల వివరాలను జిల్లా, రాష్ట్ర అధికారులకు అందజేస్తాం.

–వనం లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ